## తారు రోడ్డు పనులు పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్



2 లో


# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 19 జులై, 2025 | పేజీలు :08


# గర్జిస్తున్న గ్రామ సింహాలు

- మున్సిపల్ పరిధిలోని పలు కాలనీవాసులపై దాడి
- కేవలం పోచమ్మ వాడలో ఒక్క రోజులోనే సుమారు ఆరుగురిపై దాడి



**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మ వాడలో వీధి కుక్కల దాడికి సుమారు ఆరుగురు వ్యక్తులు గురైనట్టు సమాచారం. గురువారం సాయంత్రం ప్రాంతంలో వీధి కుక్కలు సామాన్య ప్రజలపై దాడి చేయడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల బెడదను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రకమైన పరిస్థితులు నెలకొన్నాయి. మంథని మున్సిపల్ పరిధిలోని ఏ వీధిలో చూసినా సుమారు 20 నుంచి 30 శునకాలు యథేచ్చగా తిరుగుతూ ఉంటాయి.ఇప్పటికే ఒకపక్క కోతులతో సతమతమవుతున్న మంథని ప్రజానీకానికి కుక్కల రూపంలో కొత్త సమస్య వచ్చి పడినట్లు అయ్యింది. సీజనల్ వాదులు వచ్చే కాలం కావడం దీనికి తోడు ఉన్నట్టుండి వీధి కుక్కలు దాడి చేస్తుండడంతో ప్రమాదం ఏ రూపంలో వస్తుందని అంచనా వేయలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదలు లేకుండా చేయాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.



## కలెక్టరేట్‌లో ఆధార్ అపడేషన్ కోసం

# ప్రత్యేక క్యాంపు ఏర్పాటు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆగస్టు 4 నుంచి 8 వరకు కలెక్టరేట్ లో ఆధార్ అపడేషన్ కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు మీసేవ ద్వారా అడ్రస్ తో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్ , తల్లి లేదా తండ్రి అప్ డేట్ చేసిన ఆధార్ కార్డు ఉండాలని అన్నారు. ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా నివాస సర్టిఫికెట్, బ్యాంకు పుస్తకం/ పోస్టల్ బుక్ తో సహా అటెస్టడ్ దరఖాస్తు ఫారం ఉండాలని కలెక్టర్ తెలిపారు.ఆధార్ కార్డులు పేరు స్పెల్లింగ్ పొరపాట్ల సవరణకు ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా ప్యాన్ కార్డు లేదా ఎస్.ఎస్.సి మార్కుల మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా మైనర్ ఐతే బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, పెళ్లి తర్వాత పేరు మార్పు కోసం సబ్ రిజిస్టర్ జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ ,పెళ్లి ఫోటో, ఇతర గుర్తింపు కార్డులు ఉండాలని, పూర్తిగా పేరు మార్పు కోసం గెజిటెడ్ చేసి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆధార్ కార్డు లో డేట్ అఫ్ బర్త్ కరెక్షన్ కోసం బర్త్ సర్టిఫికెట్ ,21 సంవత్సరాల పైబడిన వారికి ఫోటో తో కూడిన మార్కుల మెమో లేదా ఇండియన్ పాస్పోర్ట్ ఉండాలని అన్నారు. ఆధార్ కార్డు బయోమెట్రిక్ అప్డేట్ కోసం బయట 100 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ప్రస్తుతం ఈ క్యాంపులో అవసరం లేదని అన్నారు.ఆధార్ అప్డేషన్ అవసరం ఉన్నవాళ్లు ఈ 15 రోజుల వ్యవధిలో కావలసిన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.కలెక్టరేట్లో ఏర్పాటుచేసే ఆధార్ అప్డేట్ క్యాంపు నుఅవసరమైన ప్రజలు,ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం

## పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డిఎస్పీ మహేష్ గుండెపోటుతో మృతి

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పలువురు ప్రముఖులు

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో విషాదం అలుముకుంది. సీనియర్ పోలీస్ అధికారి గుండెపోటుతో దుర్మరణం చెందారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో డిఎస్పీగా పనిచేస్తున్న మహేష్ హుజురాబాద్‌లో గుండెపోటుతో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహేష్ శుక్రవారం గుండెపోటుకు గురికావడంతో మృత్యువాత పడ్డారు. ఆయన సతీమణి మాధవి హుజురాబాద్ ఏసిపిగా పనిచేస్తున్నారు. హుజురాబాద్ నుంచి కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించేందుకు వెళ్తుంటారు. శుక్రవారం ఉదయం ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకున్న డిఎస్పీ మహేష్‌ను వెంటనే హుజురాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స

తరువాయి 2లో

## ప్రత్యేక అవసరాలున్న పిల్లలను

# భవిత కేంద్రాలకు పంపాలి

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను జిల్లాలో ఉన్న వివిధ భవిత కేంద్రాలకు పంపించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తల్లిదండ్రులకు సూచించారు. ముకరంపురలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు ఉన్న 38 మంది పిల్లల తల్లిదండ్రులకు టిఎల్ఎం కిట్లను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అలీం కో సంస్థ ద్వారా గతంలో ప్రత్యేక అవసరాలు ఉన్న భవిత కేంద్రంలోని విధ్యార్థుల కోసం క్యాంపు నిర్వహించామని తెలిపారు. ఇందులో పిల్లల మానసిక స్థితిని బట్టి వారికి అవసరమైన లెర్నింగ్ మెటీరియల్ ఏమిటన్నది గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక అవసరాలున్న 38 మంది విధ్యార్థులకు ఈ మెటీరియల్ అందించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1485 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉండగా కొంతమందిని మాత్రమే భవిత కేంద్రాలకు పంపిస్తున్నారని తెలిపారు. భవిత కేంద్రాల్లో అనుభవజ్ఞులైన ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు వివిధ పద్దతుల ద్వారా బోధిస్తారని అన్నారు. దీనివల్ల మానసిక దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలున్న విధ్యార్థుల మనోవికాసం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రతినెల కొంత ఆర్థిక సహాయం కూడా అందుతుందని, అందువల్ల ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులను ఈ కేంద్రాలకు పంపించాలని కోరారు. వారి బాధ్యతను ప్రభుత్వం సైతం తీసుకుంటుందన్నారు. కేంద్రాలకు వచ్చిన వారిలో చాలా మందికి పరిపూర్ణత వచ్చిందని తెలిపారు. కేంద్రాలకు వచ్చిన వారిలో చాలామందికి పరిపూర్ణత వచ్చిందని అన్నారు. వీలైనంత మేర మేనరిక వివాహాలు చేసుకోవద్దని, గర్భిణీగా ఉన్నప్పుడు టీఫా స్కాన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ స్కాన్ ద్వారా పుట్టబోయే శిశువుల లోపాలను గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, అశోక్‌రెడ్డి, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం తప్ప ఓట్ల కోసం రాజకీయాలు చేయం

## ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో సంబంధిత అధికారులు అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా చూడకుండా రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు సూచనలు అందిస్తూ పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని కే ఎంఆర్ గార్డెన్‌లో మండల వ్యాప్తంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రొసిడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. ప్రొసిడింగ్ పత్రాలు పొందిన లబ్ధిదారులకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అభివృద్ధి కోసమే తప్ప ఓట్ల కోసం తాను గాని బిఆర్ఎస్ పార్టీ నాయకులు గాని రాజకీయాలు చేయరని అన్నారు. అభివృద్ధి కోసం తాము పాటు పడతామని అన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ క ళాశాల, ఆదర్శ పాఠశాలలో రాజ్య సభ సభ్యుడు కే.ఆర్. సురేష్ రెడ్డి నిధులు తో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు వివిధ రంగాల్లో అలవర్చుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శశికుమార్ రెడ్డి, ఎంపివో జగదీష్, పిఏసిఎస్ చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, నేరేళ్ల మోహన్ రెడ్డి, బద్దం అంజిరెడ్డి, మాజీ జెడ్పీటిసి సంది రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీమండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపిపి నగేష్, నాయకులు డీలర్ మల్లయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని రాఘువపట్నం గ్రామానికి చెందిన వోడ్నాల మల్లేశం గుండెపోటు కారణంగా అకాల మరణం చెందగా శుక్రవారం గ్రామంలోని ప్రజలు దయా హృదయం తో తోచిన విదంగా జమ చేసిన రూ.52500 మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా అందజేశారు. మల్లేశం కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం చేసిన వారికీ ధన్యవాదములు తెలియజేయడం జరిగింది. వోడ్నాల అంజయ్య (ఉప సర్పంచ్), కొలకాని జలందర్ ( ముదిరాజ్ సంఘము అధ్యక్షులు) వెంగలదాస్ మల్లేశం (పద్మశాలి సంఘము అధ్యక్షులు), సింగిరెడ్డి మోహన్ రెడ్డి (ఆలయ కమిటీ అధ్యక్షులు), కాళ్ళ రమేష్ (ముదిరాజ్ సంఘము ప్రధాన కార్యదర్శి) అంకం గణేష్ (పద్మశాలి సంఘము ప్రధాన కార్యదర్శి), కుంబాల లక్ష్మి రెడ్డి, కొలిపాక పెద్ద నారాయణ, కొలిపాక రత్నాకర్, కొలిపాక అనిల్, ఆడెపు భూమయ్య, ఎనగందుల మురళి, అంకం లక్ష్మి రాజం తదితరులు పాల్గొన్నారు.

# 23న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/కరీంనగర్:**తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తేదీన వామపక్ష విధ్యార్థి సంఘాల ఆద్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్ పాటిస్తున్నట్లు వామపక్ష విధ్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లాలోని తెలంగాణ చౌక్ వద్ద వామపక్ష విధ్యార్థి సంఘాల ఆద్వర్యంలో బంద్ జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డిఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. . సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్, పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్, ఏఐఎఫ్‌డిఎస్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి గడ్డం శ్రీకాంత్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు ముల్కల మారుతి, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు కేశబోయిన రాము యాదవ్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అసంపెల్లి వినయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అకాష్‌లున్నారు.

# ముస్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

## ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:**తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో సంఖ్యాపరంగా మున్నూరుకాపు జనాభా లెక్కల్లో స్పష్టత లేదని, అన్ని రంగాల్లోనూ మున్నూరు కాపు కులస్తులు వెనుకబడిపోయారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లో శుక్రవారం మున్నూరుకాపు జిల్లా కమిటీ ఆద్వర్యంలో గ్రామ, పట్టణ అధ్యక్షుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గంగుల కమలాకర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా మున్నూరు కులస్తుల లెక్కలను తామే తీసి బహిర్గతం చేస్తామన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపు కులస్తులపై దాడులు జరుగుతున్నాయన్నారు. మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలతో ఏసిబి దాడులు చేపడుతున్నారన్నారు. జైల్లో పెడుతున్నారని వాపోయారు. మున్నూరు కాపులు వెనుకబడిన కులానికి చెందినవారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మున్నూరు కాపు కులస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు కలుస్తులు రాజకీయంగా మరింత ముందుకు దూసుకుపోవాలని, రాజకీయాలను ప్రక్షాళన చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జెన్ వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుక్క వేణుగోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగుల సుధాకర్, అధ్యక్ష కార్యదర్శులు బొమ్మ రాధాకిషన్, నలువాల రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు కర్ర రాజశేఖర్, పురుమల్ల శ్రీనివాస్, బొమ్మరాతి రాజేశం, జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన అధికారులు

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తహశీల్దార్ వర ప్రసాద్ మద్యాహ్న బోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే అమ్మక్కపేట గ్రామంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ మద్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. కోమటి కొండాపూర్ గ్రామంలో వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మద్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట చేసే పాత్రలు వంటకు ఉపయోగించే పరికరాలు వంట సామాగ్రి ఎప్పటికప్పుడు నాణ్యతగా ఉండాలని, మద్యాహ్న భోజనం నిర్వహకులకు సూచించారు. వారి వెంట ఆదర్శ పాఠశబూల ప్రిన్సిపాల్ ప్రభాకర్, కోమటి కొండాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగడ్డంశ్రీనివాస్‌రెడ్డితదితరులు ఉన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులతో పేదలకు లబ్ధి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** ప్రజల సమస్యలు పట్టించుకోకుండా కన్ను పెడితే ఏకే 47 గన్ను అవుతానంటూ సోషల్ మీడియాలో రీల్స్ చేసుకుంటూ ఆ గన్ను ప్రజలపై గురిపెట్టడానికి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తిరుగుతున్నాడని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మండిపడ్డారు. జమ్మికుంటలోని వినాయక గార్డెన్స్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. జమ్మికుంట మండలానికి సంబందించి 17 చెక్కులు, పట్టణానికి 18, వీణవంక మండలానికి సంబంధించి 26 మందికి రూ.23 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు వెంటనే బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని కోరారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే చేసి చూపెట్టామన్నారు. పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, హుజురాబాద్ నియోజకవర్గంలో నూతనంగా 8700 రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాలు ప్రవేశపెట్టామన్నారు. కౌశిక్‌రెడ్డి అనుచిత ప్రవర్తన వల్లే కేసులు అవుతున్నాయని, కౌశిక్ రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడే టిఆర్ఎస్ పార్టీ కేసులు పెట్టారని గుర్తు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో రేవంత్ రెడ్డి ఫోటో తీసి పంపిణీ చేస్తున్నారని, ప్రోటోకాల్ అని చెప్పుకుంటూ తిరిగే కౌశిక్ రెడడి సీఎం ఫోటో లేకుండా చెక్కులు పంపిణీ చేయడం ప్రోటోకాల్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా చెక్కులు వచ్చిన వెంటనే అందజేయాలని ప్రణవ్ సూచించారు.

# జెఏసి చైర్మన్‌ను సన్మానించిన మత్స్య శాఖ చైర్మన్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం పెద్దపెల్లి జిల్లా జేఏసీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నుకోబడిన గర్రపల్లి గ్రామ కరోబార్ జొన్నకోటి వెంకటేశ్ ను గర్రెపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కుందేళ్ళ శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పసిడ్ల రాజు,మాదాసు శ్రావణ్ రావు, గండి రామకృష్ణ,పప్పు సంపత్ ల తోపాటు పలువురు పాల్గొన్నారు.

# తారు రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం చిన్న మెట్‌పల్లి గ్రామంలో పిఎంజి వై పథకం ద్వారా హై లెవెల్ బ్రిడ్జి మరియు చిన్న మెట్‌పల్లి నుండి కట్లకుంట వరకు, కట్లకుంట నుండి తోంబర్‌రావుపేట్ వరకు తారు రోడ్డు పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న మెట్‌పల్లి బ్రిడ్జి మరియు వివిధ గ్రామాలకు వెళ్లుటకు రోడ్ల పనులను నడుస్తున్నందున ప్రజలకు, జంతువులకు ఎలాంటి హాని జరుగకుండా జాగ్రత్తగా పనులు చేయాలని కాంట్రాక్టర్లకు సంబంధిత అధికారులకు ఆదేశించారు. నాణ్యత పరిమాణాలు పాటించాలని సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్‌రెడ్డి, ఈపిఆర్‌వో లక్ష్మ ణరావు, మండలం ఎంఆర్‌వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం

(మొదటి పేజీ తరువాయి)

అందించారు. అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయిందని గమనించిన హుజురాబాద్ ఆసుపత్రి డాక్టర్లు గంటకు పైగా సిపిఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. మహేష్ మరణించినట్లుగా డాక్టర్లు ధృవీకరించడంతో మృతదేహాన్ని కరీంనగర్‌కు తరలించారు. 1995 బ్యాచ్‌కు చెందిన మహేష్ మరణ వార్త పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏసిపి మాదవితో పాటు పోలీసులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్సై నుంచి ఇద్దరు ఒకేసారి సిఐగా, డిఎస్పీగా ప్రమోషన్ పొంది పలు చోట్ల పనిచేసి ఫ్రెండ్లీ పోలీసుగా పలువురి మన్ననలు అందుకున్నారు. డిఎస్పీ మహేష్ బాబు మృతితో సిపి గౌష్ ఆలంతో పాటు పోలీసు అధికారులు, కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌తో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు.

# కలెక్టర్ సారూ మమ్ములను ఆదుకోండి

## స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**కలెక్టర్ సారు మమ్ములను జర మీరే ఆదుకోండి అంటూ ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామనికి చెందిన మొకిన్‌పల్లి నరసవ్వ నరసయ్య అనే నిరుపేద దళిత వృద్ధ దంపతులు కలెక్టర్‌ను స్వయంగా కలిసి మొర పెట్టుకున్నారు. శిథిల అవస్థలో ఉన్న గూణపెంకల ఇల్లు తప్పా తమకు ఎలాంటి ఆస్తులు లేవని, ఒక్కగానొక్క కుమారుడు సుమన్(27) బ్రతుకుదెరువుకోసం గల్ఫ్ వెళ్లి అక్కడ మరణించడంతో, తాము దిక్కులేని వారం అయ్యామని, రోజు కూలిపని చేసుకుని జీవనాన్ని కొనసాగిస్తున్నామని , రెక్కాడుతే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తక్షణ సహాయం రెండు లక్షల రుపాయలు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించి, డిఆర్‌డిఏ శషాద్రిని, ఎంపీడీవో సత్తయ్య, కార్యదర్శి సుస్మిత సంబంధిత అధికారులకు ఆదేశాలు జారిచేశారు. త్వరలోనే మరో మూడు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. బాధితులు కలెక్టర్‌కు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నోటు బుక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థి విద్యార్థినులకు నోట్ బుక్స్, ఒక విద్యార్థి కోరిక మేరకు గైడ్స్ పంపిణీ చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు లయన్ వలస నీలయ్య. శుక్రవారం పాఠశాలలో లయన్స్ క్లబ్ సుల్తానాబాద్ అధ్యక్షులు జూపల్లి తిరుమలరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లయన్ వలస నీలయ్య సహకారంతో ఐదు వేల రూపాయల విలువగల నోటు బుక్కులను అధ్యాపక బృందం సమక్షంలో ఈ మేరకు విద్యార్థులకు అందించారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు పట్టుదల, క్రమశిక్షణతో ఉపాధ్యాయులు చెప్పే నాణ్యమైన విద్యను నేర్చుకుని, పరీక్ష సమయంలో ఎలాంటి ఆందోళన చెందకుండా, తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ సమాజంతో పాటు దేశం గర్వించే గొప్ప పౌరులుగా ఎదగాలని కోరారు. క్లబ్ అధ్యక్షులు జూపల్లి తిరుమల్ రావు, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా హంగర్ రిలీఫ్ కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, క్లబ్ ఉపాధ్యక్షులు పూసాల సాంబమూర్తి, కార్యదర్శి ఎరబెల్లి సుధీర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్కపెల్లి రిజర్వాయర్ పూర్తి చేయాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురితో పాటు మరో 10గ్రామాల రైతాంగానికి సాగునీటిని అందించే అక్కపెల్లి రిజర్వాయర్ పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కపెల్లి చెరువును సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.లు 72కోట్ల అంచనాలతో అక్కపెల్లి రిజర్వాయర్‌ను మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు నేటి ప్రభుత్వం నాటి పనులను కొనసాగించకుండా నిలిపివేయడంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపించారు. అక్కపెల్లి రిజర్వాయర్ పూర్తి అయితే మండలంలోని పది గ్రామాలలో 5వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను గుర్తించి ఆనాడు నియోజకవర్గంలో 14లిఫ్టులు చెక్ డ్యాములు మంజూరు చేసి సౌకర్యం కల్పించామని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసి పట్టించుకోవడం లేదని తెలిపారు. రంగదాముని పల్లెలో ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోగా, ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట లో స్టార్టర్లు కాలిపోయిన స్థానిక మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే కేసిఆర్ కాళేశ్వరం రూపకల్పన చేసి అన్ని చెరువులను నింపే విధంగా చరయలు చేపట్టారని కేవలం ఒక్క పిల్లర్ కుంగిందని కేసిఆర్‌ను బదనాం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయించి ప్రజలకు రైతుల సమస్యలను రైతుల పట్ల అవగాహన లేక పాలన చేయడంతో అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కేవలం తప్పుడు విధానాలు అమలు చేస్తూ రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. పది సంవత్సరాల కాలంలో రైతుల ఆత్మహత్యలు లేకుండా పాలన చేశామని నేడు అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. అక్కపెల్లి రిజర్వాయర్ సంబంధించిన గోదావరి ఒడ్డున బావి తవ్వడం పూర్తయిందని మిగతా పనులు పూర్తి చేసి చెరువులు నింపే విధంగా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వెంట డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తెమ్మ, ఎఎంసి మాజీ చైర్మన్ రాజేష్, భీమయ్య, మహిపాల్ రెడ్డి, మల్లేశం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీ పునః ప్రారంభ పాదయాత్రను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** ఈ నెల 20న తారీఖున ఆదివారం రోజున ఇందూర్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ నాయకత్వంలో మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుండి షుగర్ ఫ్యాక్టరీ పునఃరుద్ధరణ లక్ష్యంగా చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ నాయకులను కార్యకర్తలు, చెరుకు రైతులను కలిసి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల ఉపాధ్యాక్షుడు వాకిటి తిరుపతి రెడ్డి, ఓబిసి మోర్చాఅధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్, నాయకులు కాంతయ చారి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## స్వీయ రక్షణ కోసం సిసి కెమెరాలు

### ఎస్‌పి మహేష్ గీతే



**ప్రజాపక్షం / చందుర్తి :** మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు స్వీయ రక్షణ కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ గీతే పిలుపునిచ్చారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన 9 సిసి కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రనలో సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగిన , అనుమానస్పద వ్యక్తుల కదలికలు సిసి కెమెరాల ద్వారా సులభంగా కనిపెట్టవచ్చన్నారు. సిసి కెమెరాలు రాత్రింబవల్లు ప్రజలకు రక్షణ గా నిలుస్తూ , కేసుల చేదనలో సాక్ష్యాలుగా నిలుస్తాయన్నారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ మండలం లో శాంతి భద్రతల రక్షణకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు , ఎస్సై రమేష్ , పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/చొప్పదండి:** పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్ద కుర్మపల్లె, రేవెల్లి గ్రామాల్లో గ్రామ ఇన్‌చార్జిలు కొట్టె అశోక్, అనుమల్ల సత్యం గ్రామశాఖ అధ్యక్షులు కూకట్ల రాజేష్, కొత్తూరు అజయ్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంతో పాటు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దూరదృష్టితో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచడమే కాకుండా ప్రత్యేకంగా చొప్పదండి మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో ప్రజాప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు అందించి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, మాజీ ఎంపిటిసి కూకట్ల తిరుపతి, మాజీ సర్పంచ్ కొత్తూరు శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్ దామోదర్ రెడ్డి, రమణారెడ్డి, కూకట్ల బీరయ్య, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, నాయకులు ముద్దం తిరుపతిరెడ్డి, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, ముద్దసాని రంగన్న, మావురపు రాములు, గుర్రం రమేష్ గౌడ్, కడారి శంకర్, రమణారెడ్డి, జక్కుల అనిల్ కుమార్, సోమిడి శ్రీనివాస్, కొ ట్టె చందు, జక్కుల జనార్ధన్,బండారిరాజేష్,ఇరుకుల్ల అరుణ్ తదితరులున్నారు.

## పంట విస్తీర్ణం ఆధారంగా యూరియా విక్రయించాలి

**ప్రజాపక్షం / మల్లాపూర్ :**మల్లాపూర్ చిట్టాపూర్ ముత్యంపేట సిరిపూర్ గ్రామాలలోని వ్యవసాయ సహకార సంఘాలలో జిల్లా సహకార సంఘాల అధికారి సిహెచ్ మనోజ్ కుమార్ శుక్రవారం ఆ కస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో విక్రయిస్తున్న యూరియా అమ్మకాల తీరును పరిశీలించి రైతుల ఆధార్ కార్డు పట్టాదారు పాసు పుస్తకాల ఆధారంగా యూరియా విక్రయించాలని,రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి, పిఓఎస్ మిషన్ ద్వారానే ఎరువుల విక్రయాలు జరపాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట మెట్‌పల్లి క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్టర్ మారుపాక శ్రీనివాస్, సిఈవోలు రమేష్, రాజేశ్వర్, రవితేజ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** కేంద్ర ప్రభుత్వ రైతు ఉత్పత్తి దారు సంస్థ పథకంలో భాగంగా మల్లాపూర్ సహకార సంఘం ఎంపిక కాగా శుక్రవారం సంఘ చైర్మన్ వేంపేట నర్సారెడ్డిని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శాలువాతో ఘనంగా సన్మానించి సొసైటీ అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, చిట్టాపూర్ చైర్మన్ మోహన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గౌరు నగేష్, నాయకులు డీలర్ మల్లయ్య, శరత్, కొమ్ముల జీవన్ రెడ్డి, లింగ స్వామి గౌడ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలి

### కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్

ప్రజాపక్షం/కరీంనగర్: తెలంగాణ రాష్ట్రంలో ఈ యేడాది కాలంలోనే 10 కుల దురహంకార హత్యలు జరిగాయని, గత బిఆర్ఎస్ సర్కారు హయాంలో రేవంత్ రెడ్డి కులాంతర వివాహాల రక్షణచట్టం తెస్తామని చెప్పి ఎందుకు చేయడం లేదని,ఇంకా ఎంతమంది కులదురహంకారానికి బలికావాలో రేవంత్ సర్కారు సమాధానం చెప్పాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కిషన్‌రావు పేట గ్రామంలో నలుగు మల్లేష్(26) అదే గ్రామానికి చెందిన యువతి గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారని, ఆ యువతికి వేరే వ్యక్తితో పెళ్లికి సిద్ధం చేస్తున్న సమాచారంతో వారి ఇంటికి వెళ్లి మల్లేష్ అడిగితే ఆగ్రహించిన ఆ అమ్మాయి తండ్రి, బాబాయి కత్తులతో దాడి చేసి కులదురహంకార హత్యకు పాల్పడ్డారని చెప్పారు. మల్లేష్ తక్కువ కులం కావడంతో ఈ హత్య జరిగిందన్నారు. కుల దురహంకార హత్యలు రోజురోజుకీ పేట్రోగిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ హత్యలను అరికట్టడంలో తీవ్రంగా విఫలమైందన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా ఇద్దరూ మేజర్లు అయిన తర్వాత వివాహం తప్పు కాదన్నారు. కుల అహంకారంతో ఆ జంటను విడదీయడం లేదా యువకుడిని పొట్టన పెట్టుకోవడం పరిపాటిగా మారిందన్నారు. కులాంతర వివాహితులకు రక్షణ చట్టం చేయకుండా, వీటిని అరికట్టలేమని పేర్కొన్నారు. నలుగు మల్లేష్ తాను ప్రేమించిన యువతి తోటే కాపురం చేస్తానని చెప్పడం ఏ విధంగా నేరమవుతుందన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

**ప్రజాపక్షం / చందుర్తి :** మండల కేంద్రం లోని నవత ఇంగ్లీష్ మీడియంలో పాఠశాలలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నెత్తిన బోనాలు, పోతరాజుల వేషాధారణలలో విద్యార్థులు ఆటపాటలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి సంప్రదాయల పట్ల చిన్ననాటి నుండే అవగాహణ పెంపొందుతుందని పాఠశాల కరస్పాండెంట్ పత్తిపాక నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాలఅధ్యాపకబృందం పాల్గొన్నారు.



## మాక్ ఎలక్షన్స్‌తో ఎన్నికలపై పూర్తి అవగాహన



**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో సాంఘిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ ఎలక్షన్ నిర్వహించారు. విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడానికి స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కే ఆశోక్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఓటింగ్ విధానం, ఎన్నికల నర్వహణ వంటిపలు అంశాల గురించిపూర్తిగా తెలుసుకున్నారని అన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కెజిబివి పాఠశాలను తనిఖీ చేసిన అడిసినల్ కలెక్టర్



**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, తాటిపెల్లి బాలికల గురుకుల పాఠశాలను జగిత్యాల జిల్లా అడిసినల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ లో గల వంట గది , స్టోర్ రూం లను పరిశీలించి,సిబ్బందికి తగు సూ చనలు చేశారు. అదేవిధంగా విద్యార్థులకు మెను ప్రకారం అన్ని అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.వర్షాకాలం సీజన్ లో శుభ్రంగా వుండాలని,తెలిపారు.ఈ కార్యక్రమంలో తసిల్దార్ వసంత ,గిర్దావార్ తిరుపతి ఉన్నారు.

# ఆరోగ్యకేంద్రం అదనపు కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/గంగాధర:** కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాఖడే గంగాధర మండలంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేసి పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని మధురానగర్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్ స్వాతితో కలిసి మందుల నిల్వలు, ప్రసవాల గదులు, ఔట్ పేషెంట్ విభాగం, రోగులకు అందుతున్న చికిత్సలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పర్యవేక్షించారు. కుక్క కాటుతో బాధపడుతున్న, ఇతర రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాధికారి ప్రభాకర్ రావుతో కలిసి తరగతి గదులు, పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు ఉన్న వసతులు పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన అదనపు కలెక్టర్, వారి అభ్యాసస్థాయిని పరిశీలించారు. ఉపాధ్యాయులకు లెక్కలు, బాషల బోధనలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. చివరిగా మల్లాపూర్ గ్రామంలో అంగన్‌వాడీలో నిర్వహించిన శుక్రవారం సభలో పాల్గొన్నా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, మహిళలకు శ్రీమంతం ఉత్సవం, ముగ్గురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న 53 రకాల వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షిస్తూ ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారి దమ్మని రాము, తహాసీల్దార్ అనుపమ రావు, వ్యవసాయ అధికారి, పంచాయతీ అధికారి, గృహ నిర్మాణశాఖ ఇంజనీర్, ఉపాధి హామీ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢమాసం గోరింటాకు సంబరాలు




**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల పట్టణ కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌లో గల స్లేట్ హైస్కూల్‌లో శుక్రవారం ఆషాడమాస గోరింటాకు వేడుకలు అట్టహాసంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో విద్యా ర్థినీలు మహిళ ఉపాధ్యాయ బృందం చేతులకు గోరింటాకు అలంకరించుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ గోరింటాకు ఆషాడమాసంలో ఎందుకు అలంకరించుకుంటామంటే ఈ ఆషాడ సమయంలో వర్షాల కారణంగా వాతావరణంలో ఎక్కడ చూసిన రకారకాల బ్యాక్టీరియా వైరస్ వ్యాప్తి చెంది ఉంటుందని వాటికి రక్షణగా, జుట్టు నివారణకు కోసం గోరింటాకు అలంకరించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, రాజ్యలక్ష్మి, ఇంచార్జ్ మల్లిఖార్జున్ ఉపాధ్యాయిని బృందం విద్యార్థినీలు పాల్గోన్నారు.

## సిద్ధార్థ పాఠశాలలో బోనాల సంబరాలు



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండల కేంద్రంలోని సిద్దార్థ పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను రంగవల్లులు, పూలతో అందంగా అలంకరించారు. ఈ సంధర్బంగా సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి పూజలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. పిల్లల్లో ఆధ్యాత్మికతను, భక్తిభావాన్ని పెంపొందించడానికి ఇలాంటి పండుగలు దోహదపడతయాని తెలిపారు. పంచభూతాలను గ్రామదేవతలుగా భావించుకుని బోనాన్ని నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం వెనుక దాగి ఉన్న శాస్త్రీయ విషయాలపై విధ్యార్థులకు వివరించారు. వివిధ సాంప్రదాయ దుస్తులతో విచ్చేసిన విధ్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లో గత పాలకులదే.. హల్ చల్!

### అక్రమ నిర్మాణ దారుడికి సహకరిస్తారు

### అనుమతి పొందిన నోటీసులు ఇస్తారు



**ప్రజాపక్షం / మెట్ పల్లి :** పట్టణంలో మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై గత పాలకులే చలామణి అవుతు అధికారులకు కొంత వాటా మాజీ కౌన్సిలర్లకు కొంత వాటా అన్నట్లు వ్యవహరిస్తున్నారని మెట్ పల్లి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అవినీతి జరుగుతున్న స్పెషల్ ఆఫీసర్లు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గంతంలో ఐదు సంవత్సరాలు పనిచేసిన పాలకవర్గం పదవీకాలం ముగిసిన ఇప్పటికీ ఇదే పద్ధతిలో మున్సిపల్ అధికారులను చేతుల్లో పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని పలు వార్డులో స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు.

### ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారలు

మెట్ పల్లి పట్టణంలోని 10వార్డులలో టెలిఫోన్ ఎక్స్చేంజ్ వీధిలో అనుమతి ఒకలా పోంది నిర్మాణం మరోలా చేశాడని అదే వీధికి చెందిన మొహమ్మద్ నయీముద్దీన్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకునే దాఖలాలు లేవు. గతంలో అదే 10 వార్డులో కళానగర్ మూడో వీధిలో నిబంధనలకు విరుద్దంగా బహుళ అంతస్తు నిర్మాణాలు జరుగుతుందని తేదిః 2203–2024 నాడు ( సిడిఎమ్ఎ) యాప్ ద్వారా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన వాటిపై కూడా ఎలాంటి చర్యలు లేవు, ఎలాటి ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ముడుపులిచ్చుకో నిర్మాణం చేసుకో..!

పట్టణంలోని 6 వార్డులో బీడికాలనీలో అక్రమంగా నిర్మాణం చేసిన రేకుల షెడ్డు, పాత భవనంపై మొదటి అంతస్తు నిర్మాణ పై ఈనెల 11 నాడు ప్రజా పక్షం దిన పత్రికలో ప్రచురించగా వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోక , అనుమతులు పోంది నిబంధనలకు లోబడి ఉన్న వాటికి మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహించే అధికారుల పనితీరు చూస్తుంటే అక్రమ నిర్మాణ దారుడికి సహకరిస్తున్నారని స్థానిక వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణలపై నిర్లక్ష్యం వహిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులపై ఉన్నతాధికారులు చర్గ్యలు తీసుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. పట్టణ ప్రణాళిక అధికారికి ప్రజా పక్షం దిన పత్రిక విలేఖరి అక్రమ కట్టడాలపై, నోటీసుల జారీ విషయంపై వివరణ కోరెందుకు ప్రయత్నింగా స్పందించలేదు.

## ప్రతి నిరుపేదల సొంత ఇంటి కల సాకారం అవుతున్న తరుణం



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆదేశాలనుసారంగా ధరూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ శీలం సురేందర్ ఆద్వర్యంలో ధరూర్ గ్రామ ఇందిరమ్మ ఇండ్ల ప్రత్యేక అధికారి వాసవి, గ్రామ కార్యదర్శి అజయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎంపీటీసీ శీలం సురేందర్ మాట్లాడుతూ.... ఇల్లు లేని నిరుపేదల సొంత ఇంటి కల సాకారం చేయాలనే సంకల్పంతో ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, భవిష్యత్తులో మరి కొంత మంది అర్హులలైన లబ్దిదారులకు ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ధరూర్ గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మహేష్, ధరూర్ గ్రామ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు మల్లేశం, ఖాజా అలీ, శివ, తిరుపతి, రాజు,తిరుపతి, శ్రీ లక్ష్మి దేవి,లావణ్య, తిరుపతి, లక్ష్మ ణ్, అఖిల్ గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో హర్‌వాయిస్ పరిచెయ్ శిబిరం



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ ఆదర్శపాఠశాలలో వాయిస్ ఫోర్ సంస్థ వారు పాఠశాల బాలికలకు హర్ వాయిస్ పరిచెయ్ శిబిరం నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 19 వరకు నిర్వహించిన శిబిరంలో పాఠశాలలో చదువుతున్న 120 మంది బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా బాలికలలో ఆత్మవిశ్వాసం, స్వీయ సంరక్షణ, హక్కులు బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాల ద్వారా బాలికల జీవన విధానాన్ని మారుస్తుందన్నారు. వారిలోని నిజమైన శక్తిని గుర్తించగలరన్నారు. ఇది సానుకూల మార్పుకు సంకేతమని తెలియజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న ఒక బాలిక హక్కులు, స్వీయరక్షణ, శరీర మార్పుల ఉరించి సంపూర్ణ అవగాహన కలిగిందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఐశ్వర్వ, క్యాంపు కో ఆర్డినేటర్లు అంజు శ్రీ, ప్రవళిక, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

## ఇస్లాం శాంతిని బోధిస్తుంది

### నూతన మజీద్ ప్రారంభోత్సవంలో వక్తలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఇస్లాం శాంతిని బోధిస్తుందని,మతాలు వేరైనా అందరి సందేశం శాంతి మార్గం అని జమాత్ ఇస్లామీ హింద్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మహమ్మద్ ఖాలిద్ ముబాషిర్ అన్నారు. శుక్రవారం రోజున స్థానిక కలెక్టరేట్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఫిర్దోస్ మసీదును ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల మధ్య ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇస్లాం శాంతిని బోధిస్తుందని, భారతదేశంలోని యువత చెడు మార్గంలో పోకుండా భక్తి మార్గంలో పోవాలని, ఉన్నత చదువులు చదివి చదువు చెప్పిన గురువులకు, చెప్పించిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఆధ్యాత్మికతతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మీర్జా అహ్మద్ బెగ్, ఆస్లం, ఖుర్రమ్, ఎంఎ ఖలీల్, అరీఫుద్దీన్, సమీఉద్దీన్ ఎంఎ హమీద్, ముకర్రం,రౌఫ్, మస్రత్ ఇస్మాయిల్ , జావీద్, సర్దార్ ఖాన్ షకీర్ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామాల్లో 15వ విడత సామాజిక తనిఖీలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా జరిగినఉపాధి హామీ పనులు, సిసి రోడ్లు,కాంపౌండ్ వాల్, మొక్కల పెంపకం తోపాటు ఇతర పనులకు సుమారుగా ఏడు కోట్ల 52 లక్షల 21 వేల 56 రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని ఈ నిధుల ఖర్చుపై నేటినుండి ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో 15 విడత సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సురేష్ ఎస్ఆర్పి (స్టేట్ రిసోర్స్ పర్సన్) దేవేందర్, డిఆర్పీలు,ఏపీఓ దయామని తెలిపారు.

## మున్నూరుకాపు సమావేశానికి తరలివెళ్లిన నాయకులు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లాలోని మున్నూరుకాపు సామాజిక బంధుత్వాన్ని మరింత బలోపేతం చేయడం, భవిష్యత్తు కార్యచరణలపై చర్చించేందుకు శుక్రవారం కరీంనగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో జిల్లా సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని 20 గ్రామాల మున్నూరు కాపు సంఘం నాయకులు కదిలివెళ్లారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇంచార్జి పొనగంటి మల్లయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు పొనగంటి సంపత్, మున్నూరుకాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పొనగంటి సారంగం, సాయిని రవిర, పుప్పాల రాజారావు, జమ్మికుంట, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు తోట లక్ష్మ ణ్, రమేష్, నాయకులు ఆకుల రాజేందర్, పంతాటి రవీందర్, శెట్టి రాజమౌళి, ఎడ్ల రాజేందర్, చందా మహేందర్, ఏబూషి ఓదెలు, మహిపాల్, కదారి స్వామి, పొనగంటి రవీందర్, జెమిని సురేష్, పొనగంటి సతీష్, నీరటి సతీష్ తదితరులున్నారు.



## దేవాపూర్ ఎస్ఐగా గంగారాం బాధ్యతలు

**ప్రజాపక్షం / కాసిపేట :** కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా గంగారాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అక్కడ పనిచేసిన ఆంజనేయులు కాసిపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, గంగారాం కన్నెపల్లి నుంచి దేవాపూర్‌కు వచ్చారు. గంగారాం గతంలో కాసిపేటలో కూడా విధులు నిర్వహించారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల ప్రధాన బాధ్యత అని, శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని గంగారాం తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

## లక్ష్య సాధనకు అంకితభావమే మంత్రం

డైరెక్టర్ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం / మందమర్రి :** ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసినప్పుడే సంస్థ లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమవుతుందని డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ నుండి శుక్రవారం మందమర్రి వచ్చి స్థానిక జీఎం జి. దేవేందర్ తో కలిసి కెకె ఓ సి పిని సందర్శించి వ్యూ పాయింట్ వద్ద మొక్కలు నాటి, పనితీరును పరిశీలించారు. కెకె జీరో వన్ రైల్వే సైడ్, ఓసి ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. వర్షాకాలంలో ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం మందమర్రి ఏరియాలోని అన్ని గనుల మేనేజర్లు, విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ ఓ టు జీఎం విజయప్రసాద్, కెకె ఓసి ప్రాజెక్టు అధికారి మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, ఏరియా ఇంజనీరు బాలాజీ భగవత్, సివిల్ ఎస్ఇ. రాము, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అంతర్జాతీయ మహాసభలో శ్రీకాంత్ రెడ్డి



**ప్రజాపక్షం / జన్నారం :** లయన్స్ క్లబ్ ప్రపంచ మహాసభలో జన్నారం వాసి డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. అమెరికాలోని ఒర్లాండో ఫ్లోరిడా ఆరెంజ్ కౌంటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 107వ వార్షిక మహాసభలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్ ఎపి సింగ్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి 20,000 మందికి పైగా లయన్స్ సభ్యులు ఈ మహాసభకు హాజరై సేవా భావన, నాయకత్వం, అంతర్జాతీయ సౌభ్రాతృత్వాన్ని చాటిచెప్పారు. డిస్ట్రిక్ట్ 320 జి గవర్నర్ లయన్ సింహరాజుల కొదండరాం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సేవా కార్యక్రమాల గురించి విలువైన అవగాహన పొందినట్టు తెలిపారు. ఈ అనుభవం గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను మరింత బలపరచడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కర్జెల్లి, గూడెం రహదారికి కోటిన్నరతో మరమ్మత్తులు

సిర్పూర్ ఎంఎల్ఎ హరీష్ బాబు



**ప్రజాపక్షం / చింతలమానేపల్లి :** మండలంలోని కర్జెల్లి, గూడెం రహదారికి త్వరలోనే పూర్తిస్థాయి మరమ్మత్తులు జరుగనున్నాయి. ఈ రహదారిని శుక్రవారం ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి మరమ్మత్తుల కోసం కోటిన్నర రూపాయలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ అధికారులను ఒప్పించి బిటి రోడ్డుగా రూపాంతరం చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కర్జెల్లి, గంగాపూర్, గిన్నెలేటి, రవీంద్రనగర్, కౌటాల, తుమ్మిడిహేట్టి మధ్య కొత్త బిటి రహదారుల కోసం కూడా టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు మొదలవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డిఇ లక్ష్మీ నారాయణ, ఎఇ క్రాంతి, పిఆర్ ఎఇ జీవన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, జిల్లా కార్యదర్శి రాజేందర్ గౌడ్, కౌటాల మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోరిటికల్‌లో రూ.14 లక్షల ఇరిగేషన్ అభివృద్ధి పనులు ప్రారంభం..



**ప్రజాపక్షం/మామడ :** మామడ మండలంలోని కోరిటికల్ గ్రామంలో రైతుల చిరకాల కోరిక నెరవేరింది.గ్రామంలోని వ్యవసాయ భూములకు సాగునీటి కొరతను తీర్చడానికి ఉద్దేశించిన రూ.14 లక్షల విలువైన ఇరిగేషన్ అభివృద్ధి పనులను (మత్తడి)బీజేఎల్పీ నేత,స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామంలోని పలు ఎకరాల సాగు భూమికి సాగునీరు అందుతుందని,తద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని,సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.ఈ మత్తడి నిర్మాణం వల్ల వర్షాకాలంలో వృథాగా పోయే నీటిని నిల్వ ఉంచుకోవచ్చని,ఇది భూగర్భ జలాల పెంపుదలకు కూడా దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మండల అధ్యక్షుడు రంజిత్ తో పాటు ప్రముఖ నాయకులు రాంనాథ్,బాపు రెడ్డి,గోవర్ధన్ రెడ్డి,లింగారెడ్డి,చిన్నా రెడ్డి,వెంకటేశ్వర్‌రావు,రాజేశ్వర్,రవి,గంగన్న,నర్సా రెడ్డి,చక్రపాణి,అనందం,లక్ష్మి,రమణ తదితరులు పాల్గొన్నారు.ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి స్థానిక ప్రజలు అందించిన సహకారానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈ అభివృద్ధి పనులతో కోరిటికల్ గ్రామ రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

## పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని వెంటనే నియమించాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని వెంటనే నియమించాలని హెచ్ఎంఎస్ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. గతంలో ఈ బాధ్యతలు నిర్వర్తించిన డిజిఎం ఐఇడి చిరంజీవులు మృతిచెందగా, మరో డిజిఎం పర్సనల్ అధికారి అరవింద్ రావు బదిలీపై వెళ్లారని తెలిపారు. అప్పటినుంచి కొత్త అధికారిని నియమించకపోవడం వల్ల సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవడం కష్టంగా మారిందన్నారు. సమాచార హక్కు ద్వారా ఉద్యోగులు తమ సమస్యలకు పరిష్కారం కోరే పరిస్థితి లేకుండా పోయిందని, వెంటనే పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిని నియమించాలని హెచ్ఎంఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, ఎస్‌టిపిపి నాయకులు సాయి కృష్ణారెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి సైకిల్ అందజేసిన పిసిఆర్ ఫౌండేషన్

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలం అక్కపెల్లిగూడలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థి జాదవ్ ఉమేష్‌కు పిసిఆర్ ఫౌండేషన్ సాయంసంచం అందించింది. పిసిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ శుక్రవారం ఉమేష్‌కు సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిఆర్ ఫౌండేషన్ ద్వారా విద్యారంగంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు తాము సహాయహస్తం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాగుల శంకర్, మూల భాస్కర్ గౌడ్, గంగన్న, చింతల సతీష్, రాజన్న, స్కూల్ హెడ్ మాస్టర్ జాజల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్రీనివాస్‌ను సన్మానించిన బాల్ బ్యాడ్మింటన్ కమిటీ



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడిగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఎన్నికైన సందర్భంగా కాగజ్ నగర్ పట్టణంలో శుక్రవారం ఆయనను సన్మానించారు. కిమ్స్ హాస్పిటల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కమిటీ నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే నెల 22, 23, 24 తేదీల్లో రెబ్బెన మండలం గోలేటిలో ఉమ్మడి పది జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. తెలంగాణలోని పది జిల్లాల నుంచి బాల బాలికల జట్లు ఈ పోటీలో పాల్గొంటాయని, టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కమిటీ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలు హరిలాల్, వెంకటేశ్వర్లు, తిరుపతి, ట్రెజరర్ శంకర్, అనిల్ గౌడ్, చందు, మల్లేష్, వెంకటరమకృష్ణ ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు

చెన్నూరు రూరల్ సిఐ బన్సీలాల్

**ప్రజాపక్షం / కోటపల్లి/ మంచిర్యాల :** కోటపల్లి, నీల్వాయి మండలాల పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు అవకాశం ఇవ్వమని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని చెన్నూరు రూరల్ సిఐ బన్సీలాల్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా తయారీ, గంజాయి అమ్మకం, వినియోగం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ఉద్దేశ్యపూర్వకంగా గొడవలకు పాల్పడితే, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని వివరించారు. ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి ఉండాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్ఐ రాజేంద్ర, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

## ఎన్నికలెప్పుడా అని ఎదురుచూస్తున్న బరిలో నిలిచే స్థానిక అభ్యర్థులు..

ప్రభుత్వం నుండి స్పష్టమైన సమాచారం లేకున్నా అధికారులు చేపడుతున్న ఎన్నికల కసరత్తును బట్టి ఇప్పటినుండే సన్నద్ధమవుతున్న పర్టీల నాయకులు.

**ప్రజాపక్షం/ముధోల్ :** పభుత్వ అధికారులు ఎన్నికల కసరత్తు కొరకు చేపడుతున్న చర్యలను చూస్తే ఎప్పుడైన ఎన్నికల నోటిఫికేషన్ రావొచ్చనే ఆశాభావంతో బరిలో నిలిచే అభ్యర్థులు సన్నద్ధమయ్యేందుకు సిద్ధమవుతున్నారు.ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టమైన హామీ రాకున్నా ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ రావొచ్చనడానికి కొన్ని సూచనలు అందుతున్నాయి.అంతే కాకుండా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సైతం సెప్టెంబర్ లోపు పూర్తి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన విషయంతో ఎన్నికలు ఎప్పుడైనా ఉండొచ్చనే ఆశాభావానికి బలం చేకూర్చింది.దీంతో బరిలో నిలిచే స్థానిక నాయకులు సైతం ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.ఇప్పటికే తమ సహచరులతో అన్ని రకాల సమీక్షలు,సమావేశాలు అదేవిధంగా కొన్ని సహాయక చర్యలు చేసుకుంటూ ప్రజల్లో ఉండే ప్రయత్నం చేస్తున్నారు.42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదానికి వెళ్లడం జరిగింది.గవర్నర ఆమోదం రాగానే ఎన్నికల గంట మోగడం ఖాయమని ప్రతి ఒక్కరిలో ఉన్న స్పష్టమైన అభిప్రాయం.రిజర్వేషన్లు ఖరారు అయితే ప్రభుత్వం ముందు ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు ముందెళ్తుందా మరి సర్పంచ్ ఎన్నికలను ముందు నిర్వహిస్తోందో స్పష్టమైన హామీ వచ్చే వరకు వేచి చూడాల్సిందే.కాంగ్రెస్ పార్టీ అనవాయితీ ప్రకారం ముందు ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారని బాహాటంగానే వినిపిస్తున్న విషయం.దీంతో పాటు ప్రభుత్వం ఇప్పటికే జడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది.రాష్ట్రంలో మొత్తంగా జడ్పీపి31,జడ్పీటీసీ 566,ఎంపీపీ 566,ఎంపీటీసీ 5773 లుగా స్థానాలను ఖరారు చేసింది.అంతే కాకుండా ఎన్నికల యంత్రాంగం గ్రామస్థాయి ఎన్నికల గుర్తింపులను సైతం వెలువరించింది.ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌ల పదవీకాలం ముందు ముగిసిందివ తదనంతరం ఎంపీటీసీ,జడ్పీటీసీ లది,దీనిపై ప్రభుత్వం ఎలా స్పందించి ఏ ఎన్నికలు ముందు నిర్వహిస్తోందో వేచి చూడాల్సిందే.అయితే బరిలో నిలిచే అభ్యర్థులు కొందరు అయోమయంలో ఉన్నారు.ఏ ఎన్నికల్లో పోటీ చేయాలో తమ సామర్థ్యం ఎప్పుడూ పని చేస్తుందో అర్థం కానీ పరిస్థితిలో ఉన్నది మాత్రం స్పష్టం.

# ప్రమాదవశాత్తు గోడ కూలి ఇద్దరు కూలీల మృతి

ప్రజాపక్షం / చెన్నూరు : కోటపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు గోడ కూలిన ఘటన రెండు కుటుంబాలను కన్నీళ్లో ముంచింది. గ్రామానికి చెందిన రెడ్డి మధు నయ్య, శేగం తిరుపతి అనే ఇద్దరు కూలీలు శుక్రవారం పాత ఇళ్లను కూల్చే పనిలో పాల్గొన్నారు. పనకంటి శ్రీనివాస్‌కు చెందిన ఇంటిని కూల్చివేస్తుండగా అనూహ్యాంగా గోడ కూలి ఇద్దరిపై పడింది. ప్రమాదాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని 108 అంబులెన్సులో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఒక్క రోజులోనే రెండు కుటుంబాల పెద్దలు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన ఎస్ఐ రాజేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఘనంగా బోనాల సంబరాలు..



ప్రజాపక్షం/బైంసా: బైంసా మండలంలోని వాలేగాం పాఠశాలలోని శుక్రవారం బోనాల పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు.పరువురు విద్యార్థులు సాంప్రదాయ దోస్తులతో ధరించి తలపై బోనాలతో హాజరు కాగా మరికొందరూ పోతురాజు విన్యాసా వేషధారంతో ఆకర్షణంగానిలిచారు.బోనం చేసి అమ్మవారికి సమర్పించారు.అనతంరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలంకరిచాయి.ఈ సందర్భంగా తెలంగాణ పండుగలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పండుగ నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం రాధిక తెలిపారు.

# సేవ చేసే నాయకున్ని విమర్శించే స్థాయి మీకు లేదు..

బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు యేనుపోతుల మల్లేష్

ప్రజాపక్షం/బైంసా : నిత్యం ప్రజల మధ్యన ఉంటూ సేవ చేసే నాయకులు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ను విమర్శించే స్థాయి బి.ఆర్.ఎస్ నాయకులు విలాస్ గాదేవార్ కు లేదని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు యేనుపోతుల మల్లేష్ అన్నారు.బి.ఆర్.ఎస్ పాలనలో బాసర అభివృద్ధి కుంటు పడిన విషయం మీకు తెలువదా అని ప్రశ్నించారు.ఇన్ని రోజులు నిద్ర మత్తులో ఉన్న నాయకులు ఇప్పుడు మాట్లాడటం సరి కాదన్నారు.అప్పుడు బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లు అభివృద్ధి ని విస్మరిస్తే ప్రశ్నస్తున్న నాయకున్ని విమర్శించడం మానుకోవాలని లేని పక్షంలో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై సింగరేణి ప్రత్యేక దృష్టి



ప్రజాపక్షం / మందమర్రి : సింగరేణి సంస్థ తమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా మందమర్రి ఏరియా రామకృష్ణపూర్ ఏరియా హాస్పిటల్ వైద్య బృందం శుక్రవారం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. 12/12 విధానంలో విద్యార్థుల్లో 12 గ్రాముల హిమోగ్లోబిన్ స్థాయిని లక్ష్యంగా పెట్టుకుని ఆరోగ్య సర్వే చేపట్టారు. రక్తపరీక్షల ద్వారా హిమోగ్లోబిన్ స్థాయి, శారీరక బలహీనత, పోషకాహార లోపాన్ని గుర్తించారు. అనీమియా ఉన్న విద్యార్థులకు అవసరమైన ఔషధాలు, విటమిన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ముందస్తు జాగ్రత్తలతో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు సింగరేణి సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యం పట్ల సింగరేణి యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.పురుషోత్తం, అధ్యాపక వర్గం, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ లోకనాథ్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ రావుకు ప్రధానోపాధ్యాయులు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యే భవిష్యత్‌ను మలిచే ఆయుధం

ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్





ప్రజాపక్షం / కౌటాల : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, చదువును ఆయుధంగా మలుచుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన, విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. చదువుతో పాటు విలువలు, నైతికతను అలవర్చుకోవాలని సూచించారు. పేదరికం ఓ అడ్డంకిగా కనిపించవచ్చు కానీ అది విజయం సాధించడానికి ఆటంకం కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యాలను చిన్ననాటి నుంచే నిర్ధారించుకోవాలని చెప్పారు. మానసిక దృఢత, సమయపాలన, ఉపాధ్యాయుల పట్ల గౌరవం అవసరమని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తమ సమస్యలను ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ల్యాబ్, తాగునీటి కొరత, విద్యుత్ అంతరాయాలపై వినతులు చేశారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే..





ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించే పిహెచ్‌సి హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేసారు.అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించి,పాఠశాల ఆవరణలో మొక్క నాటరు.ఈ కార్యక్రమంలో నాయకులు రాంనాథ్,మాజీ ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్,నాయకులు జమాల్,మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,నాయకులు గంగయ్య ,భూషణ్, అనిల్,నరేందర్,శ్రావణ్,నర్సారెడ్డి,తో పాటు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం

ప్రజాపక్షం / నస్పూర్ : జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువతకు వెనుకబడిన తరగతుల స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ 1, 2, 3, 4, ఆర్ఆర్‌బి., ఎస్ఎస్‌సి., బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించేందుకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం, బిసి స్టడీ సర్కిల్ ఆదిలాబాద్ సంచాలకులు జి. ప్రవీణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సి., ఇంటర్మీడియట్, డిగ్రీ ధృవపత్రాలు కలిగి ఉండాలని, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (01–01–2025 తరువాత జారీ అయి ఉండాలి), ఆధార్ కార్డు కలిగి ఉండాలని, ప్రతి అభ్యర్థికి నెలకు స్టైఫండ్ క్రింద 1 వేయి రూపాయలు (బుక్ ఫండ్ సహా) చెల్లించబడుతుందని, ప్రతి నెల 75శాతం హాజరు ఉండి, గరిష్టంగా 5 నెలలు ఉండాలని తెలిపారు. డిగ్రీలో ఉత్తీర్ణత పొందిన శాతం, రిజర్వేషన్, సదరు స్టడీ సర్కిల్లో ఖాళీల ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం రెగ్యులర్లో విద్య ఉన్నవారు, ఇప్పటి వరకు టిజి బిసి స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణ పొందిన వారు, ఏదైనా ఉద్యోగంలో పని చేస్తున్న వారు అర్హులు కాదని తెలిపారు. అభ్యర్థులు ఆగస్టు 11వ తేదీ లోగా ఆన్లైన్లో www.tgbcstudy circle. cgg.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థి తల్లిదండ్రులు వార్షిక ఆదాయం గ్రామీ ణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు, పట్ట ణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని, మహిళలకు 33 1/3 శాతం, దివ్యాంగులకు శాతం, బిసి. వర్గాల కేటాయింపు ఉంటుందని, ఎస్‌సి 15 శాతం, ఎస్‌టి. 5 శాతం, ఇతరులు (ఇబిసి, అనాథలు) 5 శాతం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన వారికి ఆగస్టు 25వ తేదీ నుండి 150 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 087 32221280 నంబర్లో సంప్రదించాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# జిఒ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : మున్సిపల్ కార్మికులకు జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలోని చిల్డ్రన్ పార్కులో మున్సిపల్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మేజర్ పంచాయతీ నుండి మున్సిపల్ గా ఏర్పడి 17 నెలలు అయినా కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో కార్మికులు సమ్మె బాట పడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజయ్య, సమ్మయ్య, బాలేష్, ప్రభాకర్, శంకర్, ఇస్తారి లక్ష్మి , పద్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# బైంసా సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్న భావు సాటే 56వ వర్ధంతి..

ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలో సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్న భావు సాటే స్టాచ్ వద్ద మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ బాయి రాజన్న మాజీ జడ్పీటీసీ క్రాంతి సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తం భలేరావు తానూర్ భీమ్ పవార్ కలసి అన్న భావు సాటే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.రాబోయే ఆగస్టు ఒకటో తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.బడుగు బలహీన వర్గాల జాతి కోసం పోరాడిన వ్యక్తి జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోడాపూర్ చంద్రభాస్ గణపతి,పూజారి లక్ష్మ ణ్ 108,మొగలి దత్తు,దుర్పత్ బాయి,గాడేకర్ రాజు బైంసా,వాగ్మరే బాలాజీ మౌల గైక్వాడ్ సాయినాథ్,ఝురి బి తదితరులు పాల్గొన్నారు.

ఫోటో 18 నిర్మల్ 12

# సీజనల్ వ్యాధులపై ఆశావర్కర్లు, ఏఎన్ఎం లకు అవగాహన..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని బంగల్ పేట్ యూపీహెచ్ సి ఆసుపత్రిలో శుక్రవారం రోజు ఆశా వర్కర్లకు,ఏఎన్ఎంలకు సీజనల్ వ్యాధులపై నెలవారి సమీక్షలో బాగంగా డాక్టర మనిషా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మనీషా మాట్లాడుతూ గర్భిణీలకు,బాలింతలకు ఆరోగ్య పరీక్షలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరించారు.రక్త పరీక్షలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే కుండీలలో,పాత టైర్లు,కూలర్లు వంటి వాటిలో నీటి నిల్వలు ఉండకుండా ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా వర్కర్లు,ఏఎన్ఎంలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సివో రాములు,సూపర్వైజర్ పద్మ,సిబ్బంది శ్రీనివాస్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తపాలా సేవలు మూడు రోజులు బంద్ పోస్టల అధికారి సందీప్..

ప్రజాపక్షం/ఖానాపూర్ :ఖానాపూర్ పట్టణంలో గల పోస్ట్ ఆఫీస్‌లో తపాల సేవలకు మూడు రోజులపాటు అంతరాయం ఉంటుందని,ప్రజలది గమనించాలి పోస్టల్ సబ్ డివిజన్ అధికారి సందీప్ తెలిపారు.ఈ సందర్భంగా తను మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 19వ తేదీ నుండి 21 వరకు తపాలా సేవలలో అంతరాయం ఉంటుందని,తపాలా సేవల కొరకై అన్ని తపాల కార్యాలయలలో నూతన సాఫ్ట్ వేర్ 2.0 ప్రవేశపెట్టానున్నట్లు, వేరువేరుగా నిర్వహిస్తున్న తపాలా సేవలన్నింటీని ఓకే ప్లాటఫామ్ ద్వారా నిర్వహించే కారణంగా ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయంలలో సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి పోస్ట్ ఆఫీస్ సేవలో 22 తారీకు మంగళవారం నుండి తపాల సేవలు యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు.



## నకాష్ సంఘ భవనానికి స్థలాని కేటాయించేలా కృషి చేస్తా ఎమ్మెల్యే..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో నకాష్ కుల సంఘ భవనానికి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని శ్రీ సోమక్షత్రియ సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నాంపల్లి శివ కుమార్‌వర్మ,రాచర్ల నర్సయ్యవర్మలు కోరారు.ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత,నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఆయనకు వినతి పత్రాన్ని అందజేసి శాలువ,పూలమాలతో సత్కరించారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలో ఉన్న కుల సంఘ భవనం చిన్నదిగా మారడంతో కుల సభ్యులు ఏర్పాటు చేసుకున్న సమావేశాలు,శుభకార్యాలకు భవనం సరిపోవడం లేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రస్తుతం నకాష్ కుల సంఘ సభ్యుల సంఖ్య పెరిగిపోవడంతో సంఘ భవనం చిన్నదిగా మారిపోయిందని అన్నారు.ఈ కార్యక్రమంలో 100 మంది వరకు శ్రీసోమక్షత్రియ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వివేకానంద పాఠశాలలో బోనాల పండుగ సంబురాలు



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండల కేంద్రంలో గల వివేకానంద పాఠశాలలో విద్యార్థులు,ఉపాధ్యాయులు బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు.ఈ వేడుకలో భాగంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ పండుగలలో ముఖ్యమైన బోనాల పండుగ వేడుకను నిర్వహించారు అని అనంతరం బోనాలకు ప్రతిరూపమైన ప్రకృతి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అని పాఠశాల డైరెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల పండుగ విశిష్టత,ప్రాముఖ్యతను వివరిస్తు తెలంగాణ ప్రాంతంలో నిర్వహించే ఈ బోనాలు,పాడి పంటలు పండాలని,వర్షాలు సమృద్ధిగా కురవాలని,ప్రజలు ఆరోగ్యలతో ఉండాలని, ఎవరికి ఏలాంటి చెడు జరగకుండా ఉండేదుకు ప్రకృతి దేవతలైనా ఎల్లమ్మ, మైసమ్మ,పోచమ్మ వంటి దేవతలకు బోనాలు వేస్తారని పిల్లలకు వివరిం చారు.పాఠశాలలో పిల్లలు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పుప్పాల మల్లేష్,కరస్పాండెంట్ పుప్పాల సూజాత,ప్రిన్సిపాల్ కైలాస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ లో కేంద్ర బృందం పర్యటన ఉపాధి హామీ పనుల పరిశీలన..

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం రోజు కేంద్ర ప్రభుత్వ నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు,ఏ.శ్రీనివాస్‌రెడ్డి,నారాయణ రెడ్డి పర్యటించారు.గ్రామసభ ఏర్పాటు చేసి ఉపాధి హామీ కూలీలు,ఐకెపి సంఘ సభ్యులతో సమావేశమయ్యారు.అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను ఏ విధంగా వినియోగిస్తున్నారో తెలుసుకున్న కేంద్ర బృందం,వాటిని మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో స్థానికులకు వివరించింది.ఈ పర్యటనలో భాగంగా,ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం క్షుణ్ణంగా పరిశీలించింది.ఇందులో నర్సరీల పెంపకం,పశువుల పాకల నిర్మాణం,ఇంకుడు గుంతల ఏర్పాటు,హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా ఆయిల్ పామ్ మొక్కల పెంపకం వంటి పనులు ఉన్నాయి.అంతేకాకుండా,అటవీ ప్రాంతంలో చేపట్టిన నిరవధిక కంతకాల ప్రభాకర్ పనులను కూడా బృందం పర్యవేక్షించి,వాటి అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ ఆఫీస్ సిబ్బంది పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్,మండల ఉపాధి హామీ సిబ్బంది ఏపీఓ జగన్,ఇంజనీరింగ్ కన్సల్టెంట్ అనిల్,సాంకేతిక సహాయకులు రవీందర్,సతీష్,క్షేత్ర సహాయకులు డి.నరసయ్య మేట్ భీమేష్ తో పాటు గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



# సర్కారు బడి అభివృద్ధికి చేయి చేయి కలిపిన గ్రామస్తులు

### 30 నుంచి 75 కు పెరిగిన విద్యార్థుల సంఖ్య..



**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని మొగ్గి గ్రామ ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవన్నీ గ్రామస్తులు,ఉపాధ్యాయులు,కలిసి తీసుకువచ్చారు.గతేడాది 30 మంది విద్యార్థులు ఉండగా,ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచాలని దృఢ సంకల్పం తీసుకొని శుక్రవారం గ్రామ ఎంపీటీసీ,గ్రామ పెద్దలు,విడిసి సభ్యులు ఉపాధ్యాయులు,గ్రామంలోని విద్యార్థుల ఇంటి ఇంటికి తిరిగి విద్యార్థులు చేరే విధంగా కృషి చేశారు.దీన్ని ఫలితంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 75కి చేరింది.గ్రామ నుంచి ఇద్దరినీ విద్య వాలంటరిగా నియమించారు.వీరికి కావాల్సిన జీతాలను గ్రామ విడిసి సభ్యులు,2లక్షల రూపాయిలు విరాళంగా పాఠశాలకు అందజేశారు.ప్రైవేట్ పాఠశాలకు దీటుగ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా కృషి చేస్తామని హెచ్ఎం మౌనిక,తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్,మాజీ సర్పంచ్ లచ్చన్న,ఉపాధ్యాయులు మాధవ రావు,శిరీష,భారతి,పంచలింగ్ సాయినాథ్,జ్ఞానేశ్వర్.సాయినాథ్,భీమ్‌రావు పటేల్,లక్ష్మణ్,షాదుల్ మాణిక్,శ్రీను,లక్ష్మణ్,వీడిసి సభ్యులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని రాణాపూర్ గ్రామం నుండి గంగాపూర్ తండా వరకు రూ.2.40 (రెండు కోట్ల నలభై లక్షలు) తో ఆర్ అండ్ బి బిటి రోడ్డు నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్నాథ్,మాజీ ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్,నాయకులు జమాల్,సత్యం చంద్రకాంత్,మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి,నాయకులు అనిల్,నరేందర్,వెంకట్ రావు,సుభాష్,మోహన్,లాలురామ్,నెహ్రూ,అంబాజీ,శ్రావణ్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**బాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,ఎంపీ గోడం నగేష్**



నిర్మల్ జిల్లా కేంద్రంలో యోనెక్స్ సన్‌రైజ్ 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి,ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ లు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్,ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్,జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్,జిల్లా,పట్టణ,మండల నాయకులు,కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**జీఎన్ఆర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే..**

నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పర్యటించారు.ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ప్రజలు వరద ముంపుతో భయాందోళనకు గురవుతుండటంతో,ముందస్తుగానే ముంపు ప్రభావిత ప్రాంతమైన కాలనీలో ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందితో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.అనంతరం అధికారులను ఆదేశించి ముంపునకు కారణమైన కాలువ పునరుద్ధరణ పనులు వేగవంతం చేసి వరద సమస్య పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,అధికారులు,కార్యకర్తలు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు తప్పక నాటాలి

### సిఐ అజయ్ కుమార్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగ్యస్వామ్యం కావాలని,అది మన అందరి బాధ్యత అని ఖానాపూర్ సిఐ సీహెచ్ అజయ్ కుమార్ అన్నారు.శుక్రవారం మండలంలోని వాసవి స్కూల్‌లో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.చిన్నారులు ప్రతి ఒక్కరు వారి ప్రతి పుట్టినది రోజున తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటాలని నాటి అలానే వదిలేయకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించినప్పుడే అవి పెరిగి పెద్దవయి ఫలితాలు అందిస్తాయని అన్నారు.నేటి పిల్లలే రేపటి పౌరులు అని ఎలా అంటామో అదే విధంగా నేటి మొక్కలే రేపటి వనాలుగా మారుతాయని అన్నారు.పాఠశాల వారు నిర్వహించిన వన మహోత్సవంలో పిల్లలతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.తదనంతరం పాఠశాలలో చిన్నారులు చేసిన నాటికలతో పాటు నృత్యాలు అందర్నీ ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి రాము నాయక్,ప్రిన్సిపల్ హర్ష వర్ధిని,డైరెక్టర్ పుప్పాల సాగరిక కృష్ణ,వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ,ఉపాధ్యాయులు,పిల్లలు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం చిన్న చిన్న దేవాలయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణం తిమ్మాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ శివాజీ నగర్ కాలనీలో గల మహాలక్ష్మి అమ్మవారి పండగ నిర్వహించడం జరిగింది.ఈ మహాలక్ష్మి పండుగలో బీజేఎల్పి నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం ఎంత బాగుందని,హిందూ సంప్రదాయమే ఆధ్యాత్మిక దృక్పథంలో ఉంటుందని,రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరానని,తెలంగాణలో ప్రతి హిందూ కుటుంబ సభ్యులు ఆషాడంలో బోనాలతో పోచమ్మ,మైసమ్మ,ఎల్లమ్మ మహలక్ష్మి వంటి దేవతలని ఆరాధిస్తారని,అలాంటి హిందూ దేవాలయ పైరాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బిసి రాజన్న,సభ్యులు కరిపే శ్రీనివాస్,బక్క శెట్టి లక్ష్మణ్,ఆకుల శ్రీనివాస్,బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మహేందర్,మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్,పట్టణాధ్యక్షుడు కీర్తి మనోజ్,బిజెపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** మండలం కేంద్రంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా దిలావర్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రియాంక,ఎంపీ ఓ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఏఎన్ఎం,ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుండీలు,టైర్లు వర్షపు నీటి నిల్వ ఉండడం వల్ల దోమలు ఏర్పడి మనుషులకు కుట్టడం వల్ల జ్వరాలు రావడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,దోమల వల్ల డెంగ్యూ,మలేరియా,జ్వరాలు రావడం జరుగుతుందని రాత్రి వేళలో దోమలు కుట్టకుండా దోమతెలను వాడాలని వైద్యాధికారి తెలిపారు.వర్షపు నీటి నిల్వ ఉన్న కుండీలు టైర్లను ఖాళీ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజేశ్వర్,దుర్గ భవాని,శంకర్,ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



**ప్రజాపక్షం/మోర్తాడ్:** ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు మోర్తాడ్ మండల కేంద్రంలో ప్రజలకు ఎటువంటి జబ్బులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని అన్నీ వీధులలో గత 15రోజుల నుంచి పంచాయతీ సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్ శుక్రవారం తెలిపారు. వీధులలోని మురికి కాలువల వెంబడి ఉన్న గడ్డి మొక్కలను చంపడానికి గడ్డి మందు పిచికారి చేశామని, అలాగే దోమల నివారణ కొరకై అన్ని వీధులలోని మురికి కాలువల వెంబడి మందులను పిచికారి చేశామని అలాగే గ్రామంలో గత ఐదు రోజుల నుంచి దోమల నివారణ కొరకు వాడవాడలో ప్రభుత్వ కార్యాలయాలలో, పాఠశాలలో, పోలీస్ స్టేషన్‌లో ఆయా వీధులలోని ఇంటి పరిసర ప్రాంతాలలో గల కాలి స్థలం ఫాగింగ్ యంత్రంతో ఫాగింగ్ చేశామని ఆయన తెలిపారు. గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు ఎవరికి కూడా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు ప్రబలకుండా చూడటమే పంచాయతీ సిబ్బంది ప్రథమ లక్ష్యంగా పని చేస్తున్నామని ఎవరికి కూడా మలేరియా, డెంగ్యూ వివిధ రకాల జబ్బులు రాకుండా మా వంతు కర్తవ్యంగా గ్రామంలో ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్ తెలిపారు.



## అన్నదాన సత్రానికి ఎమ్మెల్యే భూమిపూజ

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో ఉన్న శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నిత్యాన్నదాన సత్రానికి భూమిపూజ చేశారు. ఆశ్రమంలో కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ మాతృమూర్తి లక్ష్మమ్మపేరున ఎమ్మెల్యే నిత్యాన్నదాన సత్రానికి శంకుస్తాపన చేశారు. కార్యక్రమంలో ప్రకృతి ధ్యాన మందిర వక్త కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చెక్‌డ్యామ్ నిర్మాణంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి : పశ్య పద్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ఆధ్వర్యంలో మోపాల్ మండలం ఠాణాకూర్ద్ గ్రామంలోని చెక్‌డ్యామ్‌లో భూములు కోల్పోతున్న నిరుపేద రైతులతో కలిసి చెక్‌డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మహిళలు తమ గోడును వెలిబుచ్చుకుంటూ 100 సంవత్సరాల క్రితం నుండి మా తాత ముత్తాతల వారసత్వంగా వస్తున్న భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్న మా భూముల పక్కన కంజర వాగుపై గ్రామంలోని మా భూముల కింది భాగాన చెక్‌డ్యాం నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ చెక్‌డ్యాంతో వాగు పక్కన ఉన్న మా భూముల నుండి దౌర్జన్యంగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నోటీసులు ఇవ్వకుండా రోడ్డు పోయటం జరుగుతుందని కనుక మాకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ భూములను మాకు ఇప్పించడానికి తమ సంఘం మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, రాజేశ్వర్, రాధకుమార్, రంజిత్‌కుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సైనికులుగా ఉజ్వల భవిష్యత్తును అందుకోవచ్చు



**ప్రజాపక్షం/బోధన్:** విద్యార్థులు ఎన్‌సిసి శిక్షణలో రాటుదేలి దేశానికి సేవలందించే సైనికులుగా ఉజ్వల భవిష్యత్తును అందుకోవచ్చని ఎన్‌సిసి బెటాలియన్ కమాండెడ్ కల్నల్ పి.విష్ణు నాయర్ అన్నారు. బోధన్ పట్టణంలోని ఇందూర్ హై స్కూల్‌లో శుక్రవారం ఎన్‌సిసిపి విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్నల్ విష్ణు నాయర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ సమయ పాలన అత్యవసరమని పేర్కొన్నారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో స్థాపించిన ఎన్‌సిసి యూనిట్ ద్వారా శిక్షణ పొంది అనేక మంది విద్యార్థులు భారత సైన్యంలోని మిలిటరీ, నేవి ఎయిర్‌ఫోర్స్‌లలో అనేక హోదాలలో దేశానికి సేవ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్ రామారావు, సుబేదార్ అనూజ్ రానా, బిహెచ్ఎం సతీందర్ జిత్, అవల్దార్ శ్రీకాంత్, ఎఎన్ఓ సాయిలు, పిఈటి సంతోష్ పాల్గొన్నారు.

## ఎస్సైని సన్మానిస్తున్న ధర్మసమాజ్ పార్టీ సభ్యులు

ఎస్సైని సన్మానించిన సమాజ్ సభ్యులు

**ప్రజాపక్షం/ధర్పల్లి :** మండల కేంద్రంలోని ధర్మసమాజ్ పార్టీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలు, ఉచిత విద్యా, వైద్యం, మొదలగు చర్చించారు. ఆయా విషయాలకు సానుకూలంగా స్పందించిన ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహిపాల్ మహారాజ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ మహారాజ్, మండల ప్రధాన కార్యదర్శి కిషన్, సభ్యులు నర్సయ్య, కిషన్, సాయిలు, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సారు.. మాట నెగ్గించుకున్న .. నిధుల జాడెక్కడన్న?

అయిలాపూర్ హాస్టల్ నిర్మాణానికి రూ. 2.45 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం / నందిపేట్ :** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నందిపేట్ మండలంలోని అయిలాపూర్ వసతి గృహం నూతన భవన నిర్మాణానికి రూ. 2.45 కోట్లు మంజూరు చేయించి తన మాట నెగ్గించుకున్నా ఇంతవరకు నిధులు విడుదల కాక పనులు చేపట్టక విద్యార్థులు బిక్కు బిక్కుమంటు చదువుకుంటున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాకేష్ రెడ్డి ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి నందిపేట్ మండలంలోని అయిలాపూర్ గ్రామంలో 1974 సంవత్సరంలో నిర్మించిన ప్రభుత్వ హరిజన బాలుర వసతి గృహాన్ని చూసి అవాక్కయ్యారు. స్లాబ్ పెచ్చులు ఊడి స్లాబ్‌కు వేసిన ఇనుప చువ్వలు తుప్పు పట్టడం, పిల్లర్ సిమెంట్ ఊడి చువ్వలు తేలి తుప్పు పట్టి ఉండడం చూసి ఆయన కంట నీరు పెట్టారు. ఇలాంటి వసతి గృహంలో పిల్లలు ఎలా చదువుకుంటున్నారని బాధ ని వ్యక్తం చేశారు.అక్కడ చదువుతుంది చిన్నపిల్లలని ఈ విషయం గురించి మీ అందరికి వీడియో పెట్టానని వెంటనే అవసరమైన నిదులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వసతి గృహాన్ని సందర్శించి వాస్తవాలు నివేదిక ప్రభుత్వానికి పంపారు. ఫిబ్రవరి నెల 24న జివో 59 ప్రకారం రూ. 2.45 కోట్లు మంజూరు చేస్తు షెడ్యూల్ కాస్ట్ డిపార్టుమెంటు కమిషనర్ ఆదేశాలు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ జివో కాపీ విడుదల చేశారు. అప్పటి నుండి పనుల జాడలేదు. జివో కాపీ చూసుకుంటు దాదాపు ఐదు నెలల కాలం గడిచిపోయింది. శిథిలావస్థలో వసతి గృహం మిగిలిపోయింది. ఎమ్మెల్యే తగు శ్రద్ధ చూపి పనులు ప్రారంభించాల్సిన అవసరమైంతైనా ఉంది.

## ఎంపిడిఓను సన్మానించిన నాయకులు

**ప్రజాపక్షం/ధర్పల్లి :** మండలానికి నూతన ఇన్‌చార్జి ఎంపీడీఓగా వచ్చిన లక్ష్మారెడ్డి శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెలిమెల మల్లిఖార్జున్, ఎఎంసి డైరెక్టర్ మంగీత్యనాయక్, చెలిమెల శ్రీనివాస్, మురళి, మహేందర్, నరేష్, పోతరాజు, సనుగుల వినయ్‌చారి, శ్రీకాంత్, సాయికుమార్ పాల్గొన్నారు.

## భద్రతా చర్యలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు

ఎడి ప్రభాకర్



**ప్రజాపక్షం/ఎడపల్లి:** విద్యుత్ ప్రమాదాల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు తెలియచేయడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్నా విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు తమ శాఖ అధికారులు, ఉద్యోగులతో పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎడీ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామ శివారు రైతులతో కలిసి వారికి పలు సూచనలు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తుందని, భద్రత చర్యల్లో నిర్లక్ష్యం అవగాహన లోపంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకమైన పరికరాలు వాడటం, రైతులు వ్యవసాయ మోటార్ల స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించకపోవడం వంటి కారణాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటి నివారణకు చేపట్టిన రైతు పొలంబాట కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిపోయిన స్థంబాలను మారుస్తున్నామని, ట్రాన్స్ ఫార్మర్లపై టోల్ ఫ్రీ నంబర్ 1912 రాయిస్తున్నామని, రైతులకు ఏమైనా సమస్యలుంటే తమకు తెలియచేయాలని సూచించారు. రైతులు తమ బోర్ మోటర్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ సమస్యలు రావని అన్నారు. విద్యుత్ సమస్యలు రైతులు తామే పరిష్కరించుకోకుండా తమ సిబ్బందికి తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈ కిషోర్, లైన్‌మెన్‌లు సత్యనారాయణ, పవన్, సాయిబాబా, గణేష్, మహబూబ్, మైముద్, హైమద్, రాజయ్య, తోక రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగించాలి..

విద్యార్థులను భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ అర్బన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జుమ్మెరాత్ పేట్ నందు నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ వినియోగంపై రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తిని కలిగించడానికి,విద్యార్థులను భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా రూపొందించడానికి,ఎంతో ఖర్చుతో కూడిన అటల్ టింకరింగ్ ప్రయోగశాలను జిల్లాలోని 17 పి ఎం శ్రీ పాఠశాలలకు మంజురు చేయడం జరిగిందన్నారు.అందులో భాగంగా పాఠశాలలోకి విలువైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల పరికరాలు చేరుకున్నాయని,ఒక లాప్టాప్,25 ట్యాబులు ఇతర సామాగ్రి దాదాపు 25 లక్షల రూపాయల విలువైన సామాగ్రి పాఠశాలలకు చేరిందన్నారు.వాటి వినియోగంపై రాష్ట్రస్థాయి నుండి కొఆర్డినేటర్లు రావడం జరిగిందని,వారు జిల్లాలోని ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ అందిస్తారని, తెలిపారు.ఎంపిక చేయబడిన పిఎం శ్రీ 17 పాఠశాలల్లో నుండి నిర్మల్,ఖానాపూర్ డివిజన్‌లోని 11 పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్మల్ లోని జుమ్మెరాత్‌పేట్ ఉన్నత పాఠశాల నందు,బైంసా డివిజన్ లో ఎంపికైన 6 పాఠశాలల ఉపాధ్యాయులకు బైంసా లోని దేగాం ఉన్నత పాఠశాల నందు నేడు,రేపు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని,అందరూ హాజరు అయివాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ శిక్షణ తరగతులకు పిఎం శ్రీ క్రింద ఎంపికైన 17 పాఠశాలల నుండి భౌతికశాస్త్రము,గణితం,జీవశాస్త్ర బోధించే ఉపాధ్యాయులు,ప్రతి పాఠశాల నుండి ముగ్గురేసి చొప్పున పాల్గొనడం జరుగుతుందన్నారు.విజ్ఞాన శాస్త్ర ప్రయోగాశాలను ఏర్పాటు చేయడం అనేది నీతి అయోగ్ వారు తీసుకున్న నిర్ణయం ఆధారంగా జరిగిందని,దానికి తగిన విధంగా జిల్లాలోని ఉపాధ్యాయులు విజ్ఞాన శాస్త్ర సాంకేతికను అలవర్చుకొని,జిల్లాను ముందంజలో ఉంచాలని సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలలో సమస్యలను పరిష్కరించే దిశగా విద్యార్థులచే ఆలోచింపజేయాలని,వారు సృజనాత్మకంగా ఆలోచించేలా తయారు కావాలని ఆయన తెలిపారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు పూర్తిగా అందించి,వారిని విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తి కలిగింపజేసి,వారిని భవిష్యత్తు శాస్త్రవేత్తలు గా తీర్చిదిద్దాలన్నారు.సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఉపయోగించుకున్న,ప్రతి వ్యక్తి,ప్రతి విద్యార్థి మానవ విలువలు కూడా కలిగి ఉండాలని,ఈ సందర్భంగా మానవ విలువల ప్రాధాన్యం గురించి కూడా వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నర్సయ్య,ప్రవీణ్‌కుమార్,జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్,శిక్షణ రిసోర్స్ పర్సన్స్ కళ్యాణ్‌రెడ్డి,పవన్ నిరంజన్‌లు,స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిబాబు,భౌతికశాస్త్ర,జీవశాస్త్రం,గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.